## 6

# వాయిదా

సాయంత్రం ఆఫీసు నుండి రాగానే "సుందరీ! ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. అమ్మల్ని, బాబీని కూడా పిలు" చాలా గంభీరంగా అన్నాడు శంకరం.

ఇంటికి రాగానే వేడి వేడి కాఫీ కడుపులో పడితేగానీ మామూలు మనిషికాలేదు శంకరం. ప్రొద్దున్నే కళ్ళు తెరవకుండానే, పక్కమీద నుండి కదలకుండానే కాఫీ కాఫీ అంటూ కలవరిస్తాడు. ఏ పని చేయాలన్నా ముందు కప్పు కాఫీ పడనిదే ఇంజను నడవదనే కాఫీగతప్రానుడైన పతిదేవుడు ఈరోజు రాగానే అలా మాట్లాడేసరికి బిక్క ముఖం వేసింది సుందరి.

'మీకు ఒంట్లో బాగుందా?" అంటూ అతడి నుదుటిమీద చేయివేసి చూసింది.

అర్ధాంగి చేతి స్పర్శ కాసేపు అలాగే సోకితే అసలు విషయం అటకెక్కుతుందన్న భయంతో ఆవిడచేయి తోసేస్తూ "నేను బాగానే వున్నాను. పిల్లలేరీ? పిలవమన్నానా? నేను బట్టలు మార్చుకొని వచ్చేసరికి అందరూ సిద్ధంగా వుండండి. చాలా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాలి. మనం..." బింకంగా వుండడానికి ప్రయత్నిస్తూ గాంభీర్యాన్ని చిందించాడు శంకరం.

ఏమీ అర్థంకాక అయోమయంగా నిలబడిపోయిన సుందరిని అక్కడే వదిలేసి గదిలోకి నడిచాడు.

సుందరికి ఈసారి నిజంగానే భయంవేసింది ఆయన వాలకం చూస్తుంటే ఏదో అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్న వాడిలా కనబడుతున్నాడు. 'అంత తీవ్రమైన విషయం ఏముంటుందబ్బా?' అనుకుంటున్న సుందరికి ఒక క్షణం గుండె కొట్టుకోవడం మానేసింది" కొంపదీసి ట్రాన్స్‌ఫర్‌గానీ అయిందా? అన్న అనుమానంవచ్చి.

"స్వామీ శ్రీనివాసా నీవేదిక్కు" అనుకుంటూ "బాబీ! అమ్మలూ! నాన్నగారు పిలుస్తున్నారు. ఇలా రండి. అని కేక పెట్టి వంటింట్లోకి వెళ్ళింది.

ఆవిడ కాఫీ కలిపి తీసుకువచ్చేసరికి బాబీ, అమ్మలూ, శంకరం ముగ్గురూ నిశ్శబ్దంగా కూర్చుని ఒకరినొకరు చూసుకుంటూ వుండడం కనిపించింది.

"ముందు కాఫీ తాగండి. తరువాత తీరిగ్గా మాట్లాడుకుందాం" లాలనగా

అంటూ గ్లాసు అందించింది.

"బాబీ నీ సాక్స్ తీసికెళ్ళి షూ స్టాండ్‌లో పెట్టు అమ్మలూ నీ పుస్తకాలు సోఫామీద నుండి తీసి నీ గూట్లో పెట్టిరా!" ఇంట్లో మామూలు వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తూ పిల్లలను అదిలించింది సుందరి.

శంకరం కాఫీ గ్లాసు అందుకుని దానిపైపు నిర్వేదంగా చూసాడు. అతని ముఖంలో ఒకలాటి వైరాగ్యభావం తొంగి చూసింది.

'ఇదే నా ఆఖరి కాఫీ అనుకుంటా" అన్నాడు ఒక గుటకవేసి. అతని గొంతులో విషాదం తీగెలు సాగింది.

"అవేం మాటలండీ? నా ఆయుష్షుకూడా పోసుకుని మీరు నిండు నూరేళ్ళ వుండాలి" కళ్ళ నిండా నీళ్ళు తిరుగుతుండగా జీరబోయిన గొంతుతో అంది సుందరి.

ఇంతలో అక్కడికి వచ్చిన పిల్లలు వాళ్ళిద్దరి ముఖ కవళికలు చూసి బిత్తరపోయారు.

'ఏమయింది నాన్నా?" అని బాబీ

"అలా మాట్లాడకు నాన్నా భయమేస్తుంది" అని అమ్మాయి కోరస్‌గా అరిచారు.

తెలుగు సినిమాలు ఎక్కువగాచూసే అమ్మలుకి ఘోరమైన ఆలోచన వచ్చింది. "నాన్నకేయినా బ్రెయిన్ ట్యూమరో లేక బ్లడ్ క్యాన్సరో అని చెప్పాడేమో డాక్టరు" అన్న ఊహవచ్చి చిన్నగా వెక్కిళ్ళు పెట్టడం మొదలు పెట్టింది.

'ఏమిటీ న్యూసెన్స్? అన్నట్టు కోపంగా చెల్లిలికేసి చూసి "కమ్ టు ది పాయింట్ డాడీ! అవతల క్రికెట్ మ్యాచ్ మొదలైపోతుంది." యమ ప్రాక్టికల్‌గా అన్నాడు బాబీ.

సుందరి ఇంకా పుస్తెలు కళ్ళ కద్దుకుంటూనే వుంది.

కాఫీ త్రాగడం ముగించిన శంకరం వున్నటుండి 'రేపేరోజు?" అనడిగాడు.

ప్రేక్షకుల్లా కూర్చున్న ముగ్గరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు అనుమానంగా.

"గురువారం కదా! సాయంత్రం బాబా గుడికి వెళ్ళాలనుకున్నాం కూడా" సుందరి అంది.

"సినిమా ఛానెల్‌లో ఏడుగంటలకు సినిమా" అంది అమ్మలు.

"శ్రీలంక ఇండియాల మధ్య మ్యాచ్ రేపే" బాబీ అన్నాడు.

"మీకెవరికీ బుర్రలేదు. రేపు జనవరి ఒకటో తారీఖు. అంటే న్యూ ఇయర్ డే అన్నమాట' అయిన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంత మంత గంభీరమైన విషయం కనుక్కున్నంత గర్వంగా అన్నాడు శంకరం.

"అవును సుమీ... మరిచేపోయా! ఎల్లుండే మీ చెల్లెలి పుట్టిన రోజు" అంది సుందరి.

"ఆ విషయం ప్రస్తుత చర్చనీయాంశం కాదు" చిరాగ్గా అన్నాడు శంకరం.

"అయితే విషయమేమిటో చెప్పండి. ఇంకా రాత్రికి వంట మొదలు పెట్టలేదు. "గుత్తొంకాయకూర చేయాలా లేక గోంగూర ఉల్లిపాయ పచ్చడిచేయనా అని తేల్చుకోలేక నేను చస్తుంటే ఈ మీటింగ్ ఒకటి పెట్టారు" సుందరి విసుక్కుంది.

"వంకాయకూర చెయ్యి మమ్మీ" అమ్మలు గారంగా అంది. "కాదు గోంగూర పచ్చడే కావాలి" బాబీ పంతంగా అన్నాడు.

"అందరూ నోళ్ళు మూస్తారా? శంకరం కసిరాడు. తర్వాత గొంతు సవరించుకున్నాడు.

"క్రొత్త సంవత్సరం మొదలయ్యే శుభ సందర్భంలో మనందరం కొన్ని మంచి నిర్ణయాలు తీసుకోవాలి. అవి ఖచ్చితంగా రేపటినుండి అమలులో పెట్టాలి" అని కాసేపు ఆగాడు శంకరం.

"రేపటి నుండి నేను ఒక గంట బదులు రెండు గంటలు క్రికెట్ ఆడుతాను డాడీ" ప్రామిస్ చేసాడు బాబీ.

"నేను హిందీ బాగా నేర్చుకోవాలనుకుంటున్నాను గనుక రేపటి నుండి తెలుగు సినిమాలే గాక హిందీ సినిమాలు కూడా రెగ్యులర్‌గా చూస్తాను" పాప ఉదారంగా అంది.

"జనవరి ఫస్ట్ మనందరికీ పండగవంటిదే గనుక అన్ని పండగలకి మల్లే ఈ పండగకీ క్రొత్త చీరె కొని పెడితే కట్టుకుంటానండీ" గారాలుపోయింది సుందరి.

"అందరికీ తెలివి తేటలు ఎక్కువైపోయాయి గానీ నోరుమూసుకుని వినండి. మీకై మీరు మంచి నిర్ణయాలు తీసుకోలేరు గనుక అందరి తరఫునా నేనే ఆలోచించాను. "మళ్ళీ కాసేపు ఆగాడు శంకరం.

బాబీ టైముకేసి చూసాడు. అమ్మలు కాళ్ళ పట్టీలతో ఆడుకోవడం మొదలు పెట్టింది. సుందరి సగం లేచి మళ్ళీ ఎందుకైనా మంచిదని కూర్చుంది.

"నేను రేపటి నుండి కాఫీ మానేస్తున్నా" అంటూ బాంబులాటి వార్త విసిరాడు శంకరం.

'ఆ!?' అంది సుందరి. ఆశ్చర్యార్థకాన్ని గమనించనట్టే కొనసాగించాడు శంకరం.

"బాబీ! అమ్మలూ! మీరిద్దరూ రేపట్నించి ప్రొద్దున్నే లేవాలి. మనందరం ఉదయాన్నే మార్నింగ్ వాక్ మొదలు పెడుతున్నాం, ఉదయాన్నే లేవడం అనేది మంచి క్రమశిక్షణ కూడా. సుందూ! నిన్ను నాతో బాటు కాఫీ మానేయమని చెప్పను. ఎందుకంటే దానికి చాలా మనోబలం కావాలి. అంచేత నీకు తేలికైన నియమం ఆలోచించాను. రేపటి నుండీ నువ్వు వీలయినంత వరకు ఇంగ్లీషులోనే మాట్లాడాలి. నిన్ను చూసి పిల్లక్కూడా ఆ అలవాటు అబ్బుతుంది. ఈ నిర్ణయాలన్నీ రేపటినుండే అమలులో పెట్టాలి. మార్పులు ఏమీ వుండవు ఇక మీరు వెళ్ళొచ్చు" అని ముగించాడు.

* * *

ఆ రాత్రి అన్నంలోకి ఉదయం వండిన తోటకూర పప్పు వడ్డించింది సుందరి.

"అదేమిటి? వంకాయకూర, గోంగూర పచ్చడి అన్నావుగా? అడిగాడు శంకరం.

"యువర్ మీటింగ్ ఆల్ టైమ్ ఈటింగ్" నో టైమ్ కుకింగ్" అంది తియ్యగా సుందరి.

'పిల్లలూ! తొందరగా పడుకోండి. తెల్లవారుఝామునే లేవాలి. అన్నాడు శంకరం ఆరోజు రాత్రి.

"డాడీ టి.వి.లో ఈరోజు బ్రహ్మాండమైన ప్రోగ్రామ్స్ వున్నాయి. ఈ ఒక్కరోజు పన్నెండుదాకా మేలుకొని, ఇంచక్కా హ్యాపి న్యూ ఇయర్ అని చెప్పుకుని పడుకుందాం. రేపు తొందరగా లేస్తాంలే డాడీ..." బ్రతిమాలుకున్నారు పిల్లలు.

పిల్లలతోబాటు శంకరం, సుందరి కూడా టి.వి. ముందు స్థిరపడ్డారు. నవ్వులు కేరింతలతో సమయం గడిచిపోయింది.

రాత్రి పన్నెండింటికి క్రొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వాళ్ళకి సర్‌ప్రైజ్ ఇవ్వాలని పొద్దున్నే కొబ్బరి బర్ఫీచేసి దాచి వుంచింది సుందరి అందరూ స్వీట్ తిన్నాక, అయిదింటికి అలారం పెట్టి పడుకున్నారు.

"అమ్మా పాలు" అన్న కేకతో వులికిపడి లేచింది సుందరి. టైము చూస్తే ఆరుగంటలయింది.

"ఏవండీ పిల్లల్ని లేపి మార్నింగ్ వాక్‌కి తీసికెళ్తానన్నారు. ఇటీజ్ ఆల్‌రెడీ లైట్ మార్నింగ్" అంది సుందరి.

"సుందరూ! తెల్లగా తెల్లవారిపోతే పోనీ! పిల్లలు రాత్రి చాలాసేపు మేలుకున్నారు. పాపం కాసేపు పడుకోనీ.." అటు తిరిగి పడుకున్నాడు శంకరం.

నవ్వుకుంటూ లేచి వెళ్ళింది సుందరి. వంట ఇంట్లో గ్యాస్ స్టౌ వెలిగించడం, నీళ్ళు కాచడం కమ్మని కాఫీపొడి ఫిల్టరులోకి వేయడం అన్నీ తెలుస్తూనే వున్నాయి శంకరానికి.

కానీ ఎంతసేపటికీ సుందరి మాత్రం అటురాలేదు. చూసి చూసి చివరకు లేచివచ్చి పళ్ళుతోముకుంటూ వంటింట్లోకి తొంగి చూసాడు. పెద్ద స్టీలు గ్లాసు నిండా నురగలు గ్రక్కుతున్న కాఫీ! త్రాగుతూ కనబడింది సుందరి. భర్తను చూసి చిన్నగా నవ్వింది.

ఒళ్ళుమండుతున్నా తమాయించుకుని హాల్లోకి నడిచాడు. అంతలో ఆపద్బాంధవుడిలా వచ్చాడు పక్కింటి ఆనందరావు" హ్యాపి న్యూ ఇయర్ శంకరంగారూ" అంటూ.

"సుందరీ! రావుగారొచ్చారు" అర్థాంతంగా భార్యను పిలిచాడు.

'వస్తున్నా" అంటూ అయిదు నిముషాల తర్వాత ఒక కప్పు కాఫీ పట్టుకొచ్చి ఆనందరావుకి అందిస్తూ "హ్యాపి న్యూ ఇయర్ అన్నయ్యగారు!" అంది సుందరి.

'అదేమిటమ్మా నాకొక్కడికే ఇచ్చావు కాఫీ మీ ఆయనకు లేదా ఏం?" అన్నాడాయన.

'ఆయన ఇవాల్టి నుండి కాఫీ మానేసారండి కదండీ?" నవ్వుతూ భర్తకేసి చూసింది సుందరి.

శంకరం కడుపులో మండిపోతున్నా పైకి చిరునవ్వు నవ్వాడు.

"పోనీ నువ్వైనా తెచ్చుకోమ్మా" అన్నాడాయన.

"ఇప్పుడే ఒక సోలెడు కాఫీ లాగించిందావిడ" నసిగా అన్నాడు శంకరం.

"కాఫీ ఎన్నిసార్లు తాగినా ఫరవాలేదులెండి." అంటూ వెళ్ళి మరో కప్పు కాఫీ తెచ్చుకుంది సుందరి.

ఆ కాఫీ వాసన సోకితేనే బ్రహ్మానందకరమైన అనుభవంలా అనిపిస్తుంది శంకరానికి. సన్నగా తలనొప్పి మొదలయింది అతనికి. "అయినా ఈ చిన్న చిన్న కవ్వింతలకు లొంగిపోయేంత బలహీనుడినికాను! అనుకుంటూ బింకంగా కూర్చున్నాడు.

ఆనందరావు వెళ్ళగానే పేపరు తీసాడు అక్షరాలు గజిబిజిగా కనబడుతున్నాయి తలనొప్పి ఎక్కువ అయింది.

అంతలో పిల్లలిద్దరూ వచ్చారు. "ఏం డాడీ ప్రొద్దున్నే నిద్రలేపుతానన్నారు మర్చిపోయారా? అంది అమ్మలు.

"నాన్నగారే ఆలస్యంగా లేచినట్టున్నారు అన్నాడు బాబీ

'కాదురా! అలారం మ్రోగలేదు. దాని ఇంజనుకీ ఆయిల్ పడినట్టు లేదు పాపం" ఓరగా మొగుడిని చూస్తూ చెప్పింది సుందరి.

"డాడీ! ఇవాళ మనం హొటల్‌కెళ్లి భోజనం చేద్దాం" ఉత్సాహంగా అడిగాడు బాబీ.

"నాకు వంటపని తప్పుతుంది హాయిగా" వంత పాడింది సుందరి.

"నాకు సెలవు లేదు. ఆఫీసుకు వెళ్ళాలి. తొందరగా వంట కానీ... నేను వెళ్ళి కూరగాయలు తెస్తాను" ముక్తసరిగా అన్నాడు శంకరం.

అన్న వెంటనే సంచీ తీసుకుని బయలుదేరాడు "ఏమండీ ఆల్ కాఫీ పౌడర్ ఎంప్టీ. మర్చిపోకుండా తెండి! అంది సుందరి.

భోజనాల దగ్గర ప్రశాంతంగానే కనిపించాడు శంకరం. సుందరి ఆశ్చర్యపోయినా గుంభనగా వుండిపోయింది.

సాయంత్రం అయిదింటికే వచ్చేసాడు శంకరం.

"అమ్మయ్య వచ్చేసారా? మా స్మాల్ మదర్ వన్ ఫింగర్ లెఫ్ట్ గ్రాండ్ డాటర్‌కి ఫ్లవర్ డెకరేషన్ సెరిమనీ ట నేను వెళ్ళొస్తా... కిచెన్ హవుస్‌లో సర్వెంట్ మెయిడ్ లోన్లీగా వుంది. లుక్ ఆఫ్టర్" హర్ సిల్కు చీర పైట పిన్ను పెట్టుకొని, మెడలో మామిడి పిందెల నెక్లెస్ సర్దుకుంటూ వచ్చిన సుందరి భర్తకు డ్యూటీ ఒప్పగించింది.

"ఏమిటో? మీ పిన్నమ్మ వేలు విడిచిన మనరాలికి పూల ముడుపు చేస్తున్నారా? నువ్వు వెడితే పాపం ఒంటరిగా వున్న పని మనిషిని నేను చూసుకోవాలా? ఎంత గొప్పగా చెప్పావు సుందూ! నీకు 'తర్జుమా రత్న' అని అవార్డ్ ఇవ్వాల్సిందే" ఎగతాళిగా అన్నాడు.

సుందరి గర్వంగా నవ్వి కదిలింది.

సుందరి తిరిగి వచ్చే సరికి పిల్లలు శంకరం తయారై సిద్ధంగా వున్నారు.

"మమ్మీ, సినిమాకు వెళ్తున్నాం మనం. ఆ తర్వాత హొటల్‌లో భోజనం చేసి వస్తాం" అమ్మలు వుషారుగా చెప్పింది.

'నేను ఇంగ్లీషు సినిమా అయితేనే చూస్తా... అప్పుడు ఇంకా బాగా మాట్లాడగలుగుతా." అంది సుందరి గోముగా.

జుత్తు పీక్కోవాలనిపించి మానేసాడు... శంకరం.

"నీకు భాష బాగా వచ్చేదాక నాముందు మాత్రం మాట్లాడుతూ వుండు" పిల్లల్ని కాపాడే వుద్దేశంతో భార్యకు హితబోధ చేసాడు.

వాళ్ళు సినిమా చూసి, భోజనం చేసివచ్చి పడుకునేసరికి పన్నెండు గంటలయింది.

ప్రొద్దున్నే శంకరాన్ని నిద్ర లేపింది సుందరి.

"అబ్బా! ఫస్ట్ తారీఖు ఎలాగూ అయిపోయింది కదా! పైగా ఈ చలిలో పిల్లలు ఎలా లేస్తారు పాపం? అదీకాక మనకు క్రొత్త సంవత్సరం సంవత్సరాది నాడు మొదలు పెడదాం అన్నీ" కళ్ళు తెరవకుండానే అన్నాడు శంకరం.

సుందరి నవ్వుకుంటు వెళ్ళి గ్లాసు నిండా పొగలు గ్రక్కే కాఫీ పట్టుకొచ్చింది.

ఆశ్చర్యంగా, కృతజ్ఞతగా, ప్రేమగా చూసాడు శంకరం భార్యవైపు.

"నిన్న స్మాల్ ఫ్లూట్ బ్లాక్ మాన్ హొటల్‌లో పాలపొడి పాలతో చేసిన కాఫీ తాగారటకదా పాపం! మూన్ మదర్ టోల్డ్‌మి" అంది సుందరి.

శంకరం ముఖంలో రకరకాల రంగులు కనబడ్డాయి, నవ్వూ, చిరాకు, కోపం కలగాపులగంగా కనిపించాయి.

'నువ్వు చెప్పిన వాళ్ళెవరు? పొద్దున్నే నీ ఇంగ్లీషుతో నాకు క్విజ్ పెట్టకు సుందూ ప్లీజ్" బ్రతిమాలాడాడు శంకరం.

"ఈ మాత్రం తెలీకుండానే పెద్ద ఇంగ్లీషు వచ్చునంటారే! "బాలమురళిక్రిష్ణ హొటల్‌లో నిన్న పొద్దున్న మీరు పాలపొడి పాలతో చేసిన కాఫీ తాగుతుంటే మన మిల్క్ లేడి చంద్రమ్మ చూసిందట" వివరించింది సుందరి.

తేలికగా నిట్టూర్చాడు శంకరం. "అయితే ఒక చిన్న రిక్వెస్ట్ సుందూ" బ్రతిమలాడుతున్నట్టు అడిగాడు శంకరం.

"ఏమిటో అది?" అన్నట్టు కళ్ళెగరేసింది సుందరి.

"నా వ్రతం నిన్ననే చెడింది. పిల్లలు వాకింగ్ మొదలు పెట్టలేదు. ఇవన్నీ సంవత్సరాదికి వాయిదా వేద్దామనుకున్నాం కదా! అలాగే నువ్వు ఇంగ్లీషులో మట్లాడ్డం కూడా అప్పుడే మొదలు పెడుదువుగానీ ఏం? ఈలోగా నీకు ట్యూటర్‌ని పెట్టి ఇంగ్లీషు నేర్పిస్తాను? సరే అనేసెయ్ డార్లింగ్" దీనంగా అడిగాడు శంకరం.

"ఒ.కె. మీరెంత మంచి వారండీ! నా కోసం ఎంత శ్రమ పడడానికైనా ఆలోచించరు. నిజంగా మీరు నా ప్రీవియస్ బర్త్ గుడ్‌వర్క్ ఫ్రూట్ సుమండీ" అంది సుందరి.

ఆనందంగా కాఫీ తాగుతున్న శంకరానికి పొరబోయింది పాపం ఇలాంటి భార్య తన "పూర్వజన్మ సుకృత ఫలం" అనిపించిందో ఏమో!

• A.I.R. Kurnool - 2-1-1998 •